క్లుప్తంగా

పంట సాగుపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఏవో ఖాదర్ హుస్సేన్

ఆసిఫాబాద్‌రూరల్: యాసంగి పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏవో ఖాదర్ హుస్సేన్ రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని రాజురా గ్రామ రైతులకు పంట సాగుపై పలు సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ యాసంగి పంటగా నువ్వులను సాగు చేస్తే ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. రైతుబంధు డబ్బులను పంట పొలాల పెన్సింగ్, బోర్‌వెల్ కోసం వినియోగించుకోవాలని సూచించారు. జొన్న పంట పరిశీలించి రైతులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏఈవో రెహమాన్, వార్డు సభ్యులు గోపాల్, రైతులు తిరుపతి, శ్యాంరావు తదితరులు ఉన్నారు.

నేడు వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్: శ్రీ సత్యసాయి సుజల స్రవంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ ప్రాంతంలో బుధవారం శ్రీ సత్యసాయి వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించనున్నట్లు సమన్వయకర్తలు భట్టు మల్లేశం, రఘువీర్ సింగ్‌లు తెలిపారు. ఉచితంగా గుండె వ్యాధి స్కానింగ్, మాతా శిశు సంరక్షణ, వైద్య సేవలను అందించనున్నట్లు పేర్కొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామంలో యువ క్రీడాకారులకు బీజేపీ మండల కార్యదర్శి సుల్కరి ఉమామహేష్ మంగళవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. మండలంలోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు 10వాలీబాల్ కిట్లను పాఠశాలలకు అందజేసినట్లు తెలిపారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎస్సై దంపతులు



దర్శించుకుంటున్న ఎస్సై భూమేష్ దంపతులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్ కనక దుర్గా దేవి, స్వయంభూ మహంకాళి ఆలయాన్ని మంగళవారం రెబ్బెన ఎస్సై భూమేష్ దంపతులు సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఓడి బియ్యం, నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ దంపతులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సెల్‌ఫోన్ చోరీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ఓ హోటల్ యజమాని సెల్‌ఫోన్ చోరీకి గురైంది. మంగళవారం హోటల్‌కు వచ్చిన వ్యక్తి టిఫిన్ చేసి బిల్లు చెల్లించే క్రమంలో కౌంటర్‌పై ఉన్న సెల్‌ఫోన్ కాజేశాడు. కాసేపైన తర్వాత యజమానికి సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఓ వ్యక్తి సెల్‌ఫోన్ దొంగిలించినట్లు వెల్లడైంది. దొంగతనం విషయమై హోటల్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భూమిపూజ

నార్నూర్: గాదిగూడ మండలంలోని రాంపూర్ మథురతండాల్లో గురుబాబా మందిరంలో మంగళవారం షెడ్డు నిర్మాణానికి ఎంపీపీ ఆడ చంద్రకళరాజు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సహకారంతో రూ.3 లక్షలతో షెడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు ఐక్యతతో ఉండి గ్రామాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో(రూ.లో)
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
టమాట	20
బీరకాయ	60
కాకరకాయ	40
బెండకాయ	40
అలసంత	60
దొండకాయ	80
మిర్చి	80
సొరకాయ	80
చిక్కుడుకాయ	60
గోబి (పూల్)	40
క్యాబేజి	60

- ఆసిఫాబాద్‌అర్బన్

ఆసిఫాబాద్ (కుమురం భీం):
వీరసింహారెడ్డి/వాల్తేరు వీరయ్య
కాగజ్‌నగర్ (వెంకటరమణ):
వీరసింహారెడ్డి/ వాల్తేరు వీరయ్య

జంగుబాయి దీక్షతో సన్మార్గం!

- 'గిరి' గ్రామాల్లో ఆధ్యాత్మికత
- వీర్దండిలో జోరుగా మాలధారణలు
- ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



హనుమాన్ ఆలయంలో జంగుబాయి దీక్షాపరులు

కౌటాల: ఆదివాసీలకు పుష్యమాసం పవిత్రమైనది. ఈ మాసంలో జంగుబాయిని దర్శించుకుంటే మేలు చేకూరుతుందని వారి నమ్మకం. దీంతో మండలంలోని వీర్దండి గ్రామంలోని 120మంది ఆదివాసీ మహిళలు, పురుషులు జంగుబాయి దీక్ష స్వీకరించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తూ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

భక్తి మార్గంలో..

జంగుబాయి దీక్షాపరులు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ అలవర్చుకుంటూ సాధారణ ధోరణికి భిన్నంగా ప్రత్యేకతను చాటుతున్నారు. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారు సాత్విక జీవనానికి ఆసక్తి చూపుతున్నారు. ఒక వైపు ఆధ్యాత్మికత, మరో వైపు ఆరోగ్య సూత్రాలు దీక్షలో దాగి ఉన్నాయని భక్తులు పేర్కొంటున్నారు. ఈసారి చాలా మంది యువకులు జంగుబాయి దీక్షను స్వీకరించారు. జంగుబాయి దీక్ష నియమాలు పాటిస్తూ వారు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

కఠోర నియమాలు

పుష్యమాసం వచ్చిందంటే చాలు వీర్దండి గ్రామంలో సందడి వాతావరణం నెలకొంటుంది. గిరిజన గ్రామం కావడంతో ఆదివాసీలు జంగుబాయి దీక్షను స్వీకరించి నెల రోజుల పాటు కఠోర నియమ నిబంధనలు పాటిస్తుంటారు. శివుడు, హనుమాన్‌తో పాటు కులదేవత పెర్సాపేన్, ఇష్టదైవం జంగుబాయి దీక్షలను స్వీకరించడం ఇక్కడ ప్రత్యేకం. గ్రామంలో 390 కుటుంబాలు ఉండగా అందులో అత్యధికంగా 280 వరకు ఆదివాసీ గిరిజన కుటుంబాలున్నాయి. మాలాధారణ అనంతరం గ్రామంలో ఆదివాసీలు మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. వారి కుటుంబ సభ్యులు సైతం నెల రోజులు పాదరక్షలు ధరించకుండా నియమనిష్టలతో దేవతను పూజిస్తారు. దీక్షాపరులు నేల పైనే పడుకోవడంతోపాటు బయట ఎక్కడ మంచినీరు కూడా తాగకుండా కఠినంగా ఉంటారు.

ఏటా దీక్ష స్వీకరిస్తాం



నేను గత నాలుగేళ్లుగా ప్రతి యేటా జంగుబాయి దీక్ష తీసుకుంటున్నాను. దీక్షలో ప్రతీరోజు వేకువజామున నిద్ర లేచి, ఉదయాన్నే స్నానం చేసి పూజకు సిద్ధమవుతాను. స్వాములందరితో కలిసి ఉండటం ఎంతో ఆనందంగా ఉంటుంది. జంగుబాయి దీక్షతో అందరిలో భక్తిభావన పెంపొందుతుంది.

- మడావి రేణుక, సర్పంచ్, వీర్దండి

చెడు అలవాట్లకు దూరం



జంగుబాయి దీక్షలు స్వీకరించడంతో నియమనిష్టలతో ఉంటాం. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ రోజూ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తున్నాం. నేను మొదటిసారి జంగుబాయి దీక్ష తీసుకున్నాను. దీక్షతో క్రమశిక్షణ అలవడుతుంది. భక్తిభావం పెరగడంతో పాటు ఆరోగ్యం బాగుంటుంది.

- సిడాం భాస్కర్, వీర్దండి

సన్మార్గంలో భక్తులు



జంగుబాయి మాలధారణతో భక్తిభావం పెరుగుతుంది. హనుమాన్ ఆలయంలో ప్రతీరోజు భజన చేస్తున్నాం. గత ఏడేళ్లుగా జంగుబాయి దీక్ష స్వీకరిస్తున్నా. మొదట్లో ఒకరిద్దరు మాత్రమే దీక్ష స్వీకరించేవారు. ప్రస్తుతం చాలా మంది దీక్షలో ఉండడం సంతోషకరం.

- పెందోర్ మమత, వీర్దండి

ప్రశాంతతకు నిలయం 'చాపరాడ'

- ప్రశాంతధాంగా ప్రసిద్ధి
- ఏటా వేలాది మంది భక్తుల పాదయాత్ర



చాపరాడలోని ప్రశాంతధాం

చింతలమానెపల్లి: తెలంగాణ -మహారాష్ట్ర సరిహద్దులోని వైన్‌గంగా, వార్దానదుల సంగమ స్థలం, ప్రాణహిత జన్మస్థలంలో వెలసిన ఆధ్యాత్మిక క్షేత్రం చపరాడ పుణ్యక్షేత్రం ప్రశాంతధాం పేరుతో భక్తుల మన్ననలు అందుకుంటోంది. ప్రశాంతతకు, ఆధ్యాత్మికతకు నిలయమైన ఈ పుణ్యక్షేత్రానికి ప్రతి యేడు వేలాది మంది భక్తులు వివిధ గ్రామాల నుంచి పాదయాత్రగా తరలివస్తారు.

కార్తీక్ మహరాజ్ చేతుల మీదుగా..

చపరాడ చుట్టు పక్కల ప్రాంతాల వారికి ఒకప్పుడు కార్తీక్ మహరాజ్ మాటే వేదవాక్కు. ఆయన మాట మీదుగా శుభకార్యాలు, ప్రారంభోత్సవాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆయన ఇక్కడ ఆలయాలు సైతం నిర్మించారు. కార్తీక్ మహరాజ్ పదేళ్ల క్రితం పరమపదించగా ఇక్కడ ఆయనకు విగ్రహాన్ని ఏర్పాటు చేసి మహాసమాధి నిర్మించారు. పాలరాతితో ఆలయాన్ని నిర్మించి కార్తీక్ మహరాజ్ పాదుకలకు, మహాసమాధికి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు.

ఆలయాలకు నెలవు..

కార్తీక్ మహరాజ్ ఇక్కడ మొదటగా హనుమాన్ ఆలయాన్ని నిర్మించారు. ఆయనే ఈ ప్రాంతానికి ప్రశాంతధామ్ అనే పేరు సూచించారు. హనుమాన్ భక్తుడు, సర్వసంగ పరిత్యాగి అయిన ఆయన హనుమాన్ ఆలయం ఏర్పాటు చేసి భక్తులకు బోధనలు చేస్తూ ఇక్కడే ఉండిపోయినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. హనుమాన్ విగ్రహానికి అనునిత్యం పూజలు చేసే ఆయన స్థానికులకు ఆరాధ్యంగా మారారు. హనుమాన్ ఆలయంతో పాటు, శ్రీరాముడి ఆలయం, శివుడు, సాయిబాబా, గజానన్ మహరాజ్, వీరబ్రహ్మేంద్రస్వామి, కనక దుర్గ, శ్రీకృష్ణుడి ఆలయాలను ఇక్కడ నిర్మించారు.

ఏటా పాదయాత్రలు..

చపరాడ ప్రశాంతధాం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతోంది. ఇక్కడ శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి, కార్తీక పౌర్ణమి, మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాదయాత్రగా తరలివస్తారు. ప్రతి ఏడాది మంచిర్యాల జిల్లాతో పాటు బెజ్జూర్ మండలం ఎల్కపల్లి అభయాంజనేయ ఆలయం నుంచి సమీప గ్రామాల భక్తులు పాదయాత్రగా ప్రశాంతధాంకు తరలివస్తుంటారు. కాగా నేడు పాదయాత్రలు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గంగాపూర్ భక్తుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న గంగాపూర్ భక్తులు

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన భక్తులు చపరాడలోని ప్రశాంతధాం హనుమాన్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా తెలంగాణ సరిహద్దులో ఉన్న చపరాడ ఆలయానికి ప్రతీ ఏడాది వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం పూజలు నిర్వహిస్తామని భక్తులు తెలిపారు. ఆలయంలో కాకడ హారతి, అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామం నుంచి 60మంది భక్తులు సోమవారం సాయంత్రం బయలు దేరి రాత్రికి చేరుకున్నారు. మంగళవారం రాత్రి జాగరణ నిర్వహించి భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎల్‌సీ అంజన్న

వాంకిడి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో మంగళవారం నాబార్డ్ సౌజన్యంతో సహకార బ్యాంకు ఆధ్వర్యంలో రైతులకు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఎఫ్ఎల్‌సీ అంజన్న మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బ్యాంకులో పొదుపు ఖాతా కలిగి ఉండాలన్నారు. బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లిస్తూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ అసిస్టెంట్ హరిబాబు, పీఏసీఎస్ కార్య నిర్వహణ అధికారి ఓమాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: ఎవెన్యూ ప్లాంటేషన్‌కు ముల్లకంచెలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలకు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. చాలా చోట్ల రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు నిర్జీవమవుతున్నాయని, వారిని రక్షించాలన్నారు. మొక్కలు లేని చోట మొక్కలు నాటాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈసీ ఐక్య నాయక్, తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్: పీఆర్‌టీయూ డైరీని మంగళవారం డీఈవో అశోక్ ఆ సంఘం నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మధుకర్, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, నాయకులు మారుతి, రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' జయప్రదం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్

దహెగాం: నేటి నుంచి ప్రారంభం కానున్న రెండో విడత కంటి వెలుగును జయప్రదం చేయాలని తహసీల్దార్ మధూకర్, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో నిర్వహించే కంటి వెలుగు శిబిరంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. కంటి వెలుగు చికిత్సల కోసం వచ్చే ప్రజలకు సౌకర్యాలు ఉండాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి స్పందన తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పాటు చదువులో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న కోనేరు కృష్ణారావు

పెంచికల్‌పేట్: యువత క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మండలంలోని చేడ్వాయి గ్రామంలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన అందవెల్లి జట్టుకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రూ.15 వేలు, రన్నరప్ చేడ్వాయి జట్టుకు సర్పంచ్ చౌదరి సుజాతశ్రీనివాస్ రూ.7వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసింగ్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సిద్దిఖీ, సర్పంచులు సంజీవ్, దేవాజీ, నాయకులు చౌదరి శ్రీనివాస్, సత్తన్న, ఎస్‌కే బాబు, నిర్వాహకులు మోయిన్, శశి, వెంకటేష్, తాజ్, చారి తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు ఎమ్మెల్యే హామీ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: పుంజుమేరగూడలోని భీమన్న గుడి వద్ద భక్తుల కోసం షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంగళవారం గ్రామస్తులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి విన్నవించారు. షెడ్డు లేక భక్తులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరుకు హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, గ్రామస్తులు వడ్డె రాంచందర్, వడ్డె రవి, ఠాక్రే వెంకటి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన టేలా



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన టేలా

రెబ్బెన: మండల కేంద్రంలోని జర్నలిస్టు కాలనీలోని ప్రెస్‌క్లబ్ తాత్కాలిక భవనం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇటీవల అక్రమంగా టేలా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఆక్రమించేందుకు కొందరు అక్రమార్కులు యత్నిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో కొన్ని నెలలుగా ప్రభుత్వ ఖాళీ స్థలాల ఆక్రమణలు జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే రెబ్బెన రైతువేదిక ముందు, వెనుక భాగాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి టేలాలు ఏర్పాటు చేసుకున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా రెబ్బెన ప్రెస్‌క్లబ్ కోసం తాత్కాలికంగా కేటాయించిన భవనం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో రాత్రికి రాత్రే దర్జాగా టేలా ఏర్పాటు చేశారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా అక్రమంగా టేలా ఏర్పాటు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. టేలాను తొలగించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెలంగాణ గిరిజన సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కనక యాదవ్‌రావు

నార్నూర్(జైనూర్): ఆదివాసీ గిరిజనుల హక్కులు, చట్టాల అమలు కోసం తెలంగాణ గిరిజన సంఘం నిర్విరామంగా కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. మంగళవారం జైనూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో తెలంగాణ గిరిజన సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా ఆదివాసీ గిరిజన సమస్యలపై పోరాటం చేస్తూ గిరిజనులకు అండగా నిలవడానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభుదయ, సంఘం జిల్లా అధ్యక్షుడు కొట శ్రీనివాస్, గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాస్‌రెడ్డి, సార్మేడి జుగ్నాక్ దేవురావు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు మాడవి భీంరావు, సర్పంచ్‌లు లక్ష్మణ్, శ్యాంరావు, టీఏలు ఆత్మరాం తదితరులు ఉన్నారు.

2వ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



వినతిపత్రం అందజేస్తున్న 2వ ఏఎన్‌ఎంలు

ఆసిఫాబాద్‌అర్బన్: వైద్య శాఖలో పనిచేస్తున్న 2వ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌వో ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ 2వ ఏఎన్‌ఎంలు గత 15 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రజల ప్రాణాలు కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. సమానపనికి సమాన వేతనం అందజేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, 2వ ఏఎన్‌ఎంలు పుణ్యబాయి, భాగ్యలక్ష్మి, సునీత, ప్రమీల, వసంత, రజిని, సత్తమ్మ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రెబ్బెన: పట్టుబడిన బియ్యంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. భీమిని మండలం నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని, ఆటోను సీజ్ చేసి డ్రైవర్ చాంద్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి సేకరించి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్, రెబ్బెన పరిధిలోని గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. తాటికొండ దీపక్ అనే వ్యక్తి టాటాఏస్ వాహనంలో సుమారు 8 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. దీపక్‌పై కేసు నమోదు చేసి పట్టుబడిన బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ క్వార్టర్లలో చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం) రెండు క్వార్టర్లలో చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని న్యూకాలనీ ఎస్పీఎం ఉద్యోగి వెంకటేష్ సంక్రాంతి పండగ కోసం రెబ్బెన మండలంలోని తుంగెడ గ్రామానికి వెళ్లాడు. దీంతో ఆయన నివసిస్తున్న ఓఆర్‌టీ -345 క్వార్టర్ తాళం పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన ఆయన తాళాలు పగిలి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాలోని రెండు తులాల బంగారు నగలు, 12 తులాల వెండి గొలుసులు, రూ.5 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. అదే క్వార్టరు వెనుక భాగంలోని ఓఆర్‌టీ-808 ఎస్పీఎం ఉద్యోగి శంకర్ కుటుంబ సభ్యులు సైతం గోదావరిఖనికి వెళ్లి బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగి రాగా, తాళాలు పగలగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. టౌన్ ఎస్‌హెచ్‌వో రవీందర్, ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలాలను సందర్శించి వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్, వేలిముద్ర నిపుణులతో విచారణ చేపట్టారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న హెల్త్ అధికారి లలిత

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో పనిచేసే ఉద్యోగులు విధులకు హాజరయ్యే క్రమంలో రోడ్డు ప్రయాణ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని హెల్త్ ఆఫీసర్ లలిత సూచించారు. బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. హెల్మెట్ ధరించటం, సీట్ బెల్ట్ ఉపయోగించటంతో పాటు నియంత్రిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఓసీపీ మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్ రావు, జీఎం కమిటీ సభ్యులు మారిన వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సంక్షేమ అధికారి వేణు పాల్గొన్నారు.